క్లుప్తంగా

మేధో హక్కులపై అవగాహన

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మేధో హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం వికాస్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వ సంస్థ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇంట్లెక్చువల్ ప్రాపర్టీ అవేర్నెస్ మిషన్ (ఆర్‌జీఎన్‌ఐపీఎం) సంయుక్త ఆధ్వర్యాన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరిగింది. ఇటువంటి అవగాహన సదస్సులు వికసిత్ భారత్ – 2047కు ఎంతో ఉపయోకరమని కళాశాల చైర్మన్ నర్సిరెడ్డి పేర్కొన్నారు. వర్చువల్ ల్యాబ్స్‌పై అవగాహన సదస్సును ఈ నెల 5వ తేది శనివారం ఐఐటీ ఢిల్లీ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పవన్‌సాయి, అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ పేటెంట్ డిజైన్ కుమార్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, డైరెక్టర్ కీర్తిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వారాహి నవరాత్రులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులచే అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తరం జరిపారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది మూల్పూరు సతీసక్కుబాయి దంపతులు, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన సాయికల్యాణి అమ్మవారికి అషాడ సారెను సమర్పించారు. వారాహి నవరాత్రులను విజయవంతంగా ముగించినందుకుగాను భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

బాకీ నరేష్‌కు డాక్టరేట్



కంకిపాడు: కంకిపాడుకు చెందిన బాకీ నరేష్‌కు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. హైదరాబాద్ జేఎన్‌టీయూలో మెకానికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి పర్యవేక్షణలో నరేష్ ఆప్టిమైజేషన్ ఆఫ్ వైర్ ఎలక్ట్రిక్ డిశ్చార్జ్ టర్నింగ్ ఆఫ్ ఏరోస్పేస్ ఎలైస్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకుగానూ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు నరేష్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తన పరిశోధన అంశాలు విమానయాన రంగానికి ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

హనుమాన్‌జంక్షన్ రూరల్: మద్యం సేవించి ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు నూజివీడు న్యాయస్థానం నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు వీరవల్లి ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గత నెల 5వ తేదీన బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిపై వీరవల్లి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కంకిపాడుకు చెందిన ఆటో డ్రైవర్ కొరపక పూర్ణచంద్రరావు మద్యం సేవించి వాహనం నడపడాన్ని పోలీసులు గుర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మిషన్ ద్వారా చెక్ చేయగా 465 పాయింట్లుగా రీడింగ్ రావడంతో పూర్ణచంద్రరావుపై ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో శుక్రవారం నూజివీడు కోర్టులో హాజరుపర్చగా ఆటో డ్రైవర్ పూర్ణచంద్రరావుకు న్యాయమూర్తి నాలుగురోజుల జైలు శిక్ష విధించారు.

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

పెనమలూరు: భార్య మృతి చెందిందనే మనస్తాపంతో పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం .. పోరంకి సాలిపేటకు చెందిన కలింగపట్నం బలరామ్(70) భార్య ఇటీవల మృతి చెందింది. భార్య చనిపోయినప్పటి నుంచి మనస్తాపంతో మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలో పింఛన్ సొమ్ముతో మద్యం, పురుగు మందు కొని బుధవారం తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్యానికి చేర్చారు. చికిత్స పొందుతున్న బలరామ్ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు కానూరు నుంచి జగన్నాథుని రథయాత్ర

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్ తెలిపారు. ఈ రథయాత్రను పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభిస్తారని చెప్పారు. స్వామివారి యాత్ర శ్రీసాయిగీత మందిరం నుంచి పంట కాలువ రోడ్డు, నాగార్జున ఆస్పత్రి, నెక్స్‌జెన్ పబ్లిక్ స్కూలు, ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు, బందర్‌రోడ్డు మీదుగా ఆటోనగర్ శ్రీసాయిబాబా కల్యాణ మండపం వరకు హరినామ సంకీర్తనలతో వైభవోపేతంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

కూలబడిన చదువులు..!

- పడగొట్టిన రామవరప్పాడు జెడ్పీ హైస్కూల్ పాత భవనం
- పాత క్యాంపస్ విద్యార్థులు కూడా కొత్త క్యాంపస్‌లోనే
- వరండాలోనే తరగతులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్త క్యాంపస్‌లో అభివృద్ధి పరిచిన తరగతి గదులు



కూలగొట్టిన పాత క్యాంపస్‌లో నిలిచిన మురుగు, వర్షం నీరు

రామవరప్పాడు: విద్యాభివృద్ధికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరుస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించడంలేదు. దీనికి రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామంలోని రాజుల బజార్‌లోని జెడ్పీ పాఠశాల (పాత క్యాంపస్) శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల శ్లాబులు పెచ్చులు ఊడి పడటం, వర్షం నీరు, డ్రెయిన్ మురుగు పాఠశాలలో తిష్ఠ వేస్తుండటంతో గత విద్యా సంవత్సరంలో శిథిలమైన భవనాన్ని కూలగొట్టారు. భవనం కూలగొట్టి నెలలు గడుస్తున్న కొత్త భవనం నిర్మాణానికి ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం కూలగొట్టిన పాఠశాల 1998లో మండల పరిషత్ పాఠశాల నుంచి జిల్లా పరిషత్ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం, తరగతి గదులు చాలకపోవడంతో 2005లో గ్రామంలోని చిన్మయి ధ్యాన మందిరం సమీపంలో మరో కొత్త పాఠశాల శంకుస్థాపన చేసి కొంత వరకు పనులు నిర్వహించారు. అప్పటి నుంచి తరగతులను విభజించి రెండు క్యాంపస్‌లలో విద్యార్థులకు విద్యనందిస్తున్నారు.

ఒకే భవనంలో విద్యా బోధన

రెండు క్యాంపస్‌ల్లో ఆరు నుంచి పదో తరగతి వరకూ మొత్తం 1,009 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాత క్యాంపస్ కూల్చడంతో ఈ క్యాంపులోని విద్యార్థులను కూడా కొత్త క్యాంపస్‌లోనే కలిపి తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో తరగతి గదులు చాలక విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిమితికి మించి తరగతి గదుల్లో విద్యార్థులను ఉంచడం, వరండాల్లోనే విద్యాబోధన చేస్తున్నారు. దీంతో నేల మీద కూర్చొని విద్యార్థులు పాట్లు పడుతున్నారు. పదో తరగతి విద్యార్థులను కూడా తరగతి గదుల్లో బెంచీలు చాలకపోవడంతో నేల మీదే కూర్చొబెడుతున్నారు.



కొత్త క్యాంపస్‌లో వరండాలోనే విద్యాబోధన

ఇరుకు గదుల్లో తరగతులు

కూల్చిన పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ఇప్పటి వరకూ అంచనాలు కూడా రూపొందించలేదు. ఒక పక్క తరగతి ఇరుకు గదులు, వరండాలో కూర్చోబెట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కొత్త భవనం నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారని వాపోతున్నారు. పాఠశాల నుంచి మాత్రం మూడు అంతస్తులతో 12 తరగతి గదులు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్న ఇప్పటి వరకూ సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే పాఠశాల నూతన భవనం నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి

చిన్మయి ధ్యాన మందిరం సమీపంలో కొత్త క్యాంపస్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరిచారు. తొమ్మిది తరగతి గదుల నిర్మాణం నిమిత్తం రూ. 1.8 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటిలో 50 శాతం నిధులతో తరగతి గదులు నిర్మించారు. విద్యార్థులకు అవసరమయ్యే బెంచీలు, కుర్చీలు సమకూర్చారు. వీటితో పాటు గ్రామంలోని పలువురు దాతలు స్పందించి పలు సౌకర్యాలు సమకూర్చారు.

ప్రతిపాదనలు పంపించాం



కూలగొట్టిన పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. సర్వశిక్షా అభియాన్, విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేకు లెటర్లు అందించాం. పాత క్యాంపస్ విద్యార్థులకు కూడా కొత్త క్యాంపస్‌లోనే విద్యాబోధన చేస్తున్నాం. గదులు చాలకపోవడంతో వరండాలో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

– ఎస్‌పీవీ తాయారు, పాఠశాల హెచ్‌ఎం

తంబి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు



జోసఫ్ తంబి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జైలు నుంచి విడుదల కావడంతో కేసరపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, రవిప్రకాష్ దంపతుల నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పుణ్యక్షేత్రంలో 116 కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులను వెలిగించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంశీమోహన్‌పై ఎన్ని అక్రమ కేసులు, ఇబ్బందులు పెట్టిన చివరికి న్యాయమే గెలిచిందన్నారు. అజ్జంపూడి ఎంపీటీసీ దొడ్ల స్వర్ణకుమారి, మాజీ సర్పంచి నీలం మహోదయ ఆంథోని, వైఎస్సార్ సీపీ నేతలు మెండెం రాంబాబు, వేముల శ్రీనివాసరావు, మోత్రు ఆంథోని, షేక్ బుడ్డే, సాంగ నరేంద్ర, బండి భాస్కరరావు, కాటూరి కిరణ్, కన్నెగంటి వర్మ, గద్దె శ్రీకాంత్ షిండే, దాసరి ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గన్నవరం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఈయూ నేతలు



ఉయ్యూరు డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

గన్నవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పాటు యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రీజినల్ సహాయ కార్యదర్శి ఎస్. మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సర్క్యులర్ నెం. 01/2019ను యధావిధిగా అమలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే సొంతంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. టిమ్స్ డ్యామేజీలపై రికవరీ నిలిపివేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. డబుల్ డ్యూటీ చేసిన సిబ్బందికి డీడీ అమౌంట్‌ను పెంచాలని, 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని డిపో కార్యదర్శి టీవీకే రావు డిమాండ్ చేశారు. డిపో అధ్యక్షుడు సంజీవరావు, ఉపాధ్యక్షుడు పద్మనాభులు, కోశాధికారి యూవీ రావు, గ్యారేజ్, డ్రైవర్ అసోసియేషన్ ప్రతినిధులు నాని బాబు, కేఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఆర్టీసీలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉయ్యూరు డిపో ఎదుట శుక్రవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీ రావు, ప్రతినిధులు కేవీఎస్ రావు, పీవీఎస్ నారాయణ, రవికుమార్, ఉద్యోగులు పాల్గొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిపో అధికారులకు అందజేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

గన్నవరం: ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి కార్మిక సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వల్ల అసంఘటిత రంగంలోని కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. రవాణా రంగంలో ఓలా, ఉబర్, ర్యాపిడోను అనుమతించడంతో ఆటో, ట్యాక్సీ నడుపుకొనే కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం, ఆశలు, ముఠా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని జిల్లా నాయకుడు వై.నరసింహారావు విమర్శించారు. నేతలు బెజవాడ తాతబ్బాయి, గండికోట సమ్మక్క, బడుగు మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు కాల్వగట్టు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సురక్షిత తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, మోటారు బోర్ల ద్వారా అందే నీరు తాగేందుకు పనికి రావడం లేదని సభలో కాల్వగట్టువాసులు తెలిపారు. హిందూ శ్మశానం వద్ద, కొడాలివారి వీధిలో డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో పలు చోట్ల రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు, బిల్డింగ్ మెటీరియల్స్ ఉన్నాయని వీటిని తొలగించాల్సిందిగా ఫిర్యాదు చేశారు. గ్రామంలో రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ గ్రామసభలో వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విద్యాధర్, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, నగుళ్ల కుమారి, దీనా, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహనరావు

రామవరప్పాడు: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ 83వ నూతన కార్యవర్గ నియామక కార్యక్రమం శుక్రవారం రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ పేదలకు, విద్యార్థులకు, మహిళలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం 2024–25 రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలిగా విధులు నిర్వహించిన డాక్టర్ వి. శ్రీదేవి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది రోటేరియన్ ఎస్. బాలగోపాల్‌కు పదవీ బాధ్యతలను అప్పగించారు. నూతన కార్యదర్శిగా ఎం. రాంగోపాల్‌రావు, కోశాధికారిగా జి. భానుప్రకాష్ నియమితులయ్యారు. వీరిచే రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సుమారు రూ. 2లక్షలు విలువజేసే స్ట్రీట్ ఫుడ్ కార్ట్, పాఠశాల విద్యార్థులకు 3 సైకిళ్లు, 13 కుట్టు మిషన్లు, 21 రైస్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథి తాడికొండ శ్రీరామ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సుదీప్తి, ఇతర రోటరీ క్లబ్‌ల జిల్లా గవర్నర్లు, రోటేరియన్లు, రోటారాక్టర్లు, పూర్వ అధ్యక్షుడు ఎం.వి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి



కానూరులో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాడీ బిల్డింగ్ క్రీడాకారులు



ఉయ్యూరులో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెనమలూరు: కానూరులో మన్యం విప్లవ వీరుడు అల్లూరు సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కానూరు అశోక్‌జిమ్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశం కోసం ప్రాణాలు అర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ అధికారి రఘురామ్, విద్యుత్ శాఖ అధికారి కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఉయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దళపతి కాంప్లెక్స్ ప్రాంగణంలో క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సీహెచ్‌వీవీ కుటుంబరాజు, బీ ప్రసాదరాజు, బీ నాగరాజు, రమేష్‌రాజు, మహారాజు, కోటప్పరాజు, సీపీఎం నాయకులు కోసూరు శివనాగేంద్రం, లయన్స్ ప్రతినిధులు డాక్టర్ రావులపల్లి సుధాకర్, నల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంశీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



రామవరప్పాడు: కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లో అరెస్టు అయ్యి ఇటీవల బెయిల్‌పై విడుదలైన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను వైఎస్సార్ సీపీ విజయవాడరూరల్ మండల నాయకులు శుక్రవారం గన్నవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వంశీమోహన్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యుడు దూరు రత్నం, యూత్ నాయకులు సర్నాల రవి, కూరాకుల సుబ్బారావు, దొంగా వాసు తదితరులు వంశీను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రజా నాయకుడు వీఎం రంగా



నున్నలో కేక్ కట్ చేస్తున్న రంగా అభిమానులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ పేదల కోసం అలుపెరగని పోరాటం చేసిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, భీమవరపు ముత్తారెడ్డి, అంగజాల హనుమా, కొట్టే రవి, నాగబాబు, కలకోటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కోడూరుపాడులో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి శుక్రవారం జరిగింది. గ్రామంలోని రంగా విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చందు శివ, గ్రామ ప్రముఖులు కొండపల్లి వెంకటేశ్వరరావు, అంబటి రాజేష్, బాడిగ కుమార్, గరికపాటి నాగబాబు, నూకల గోవిందయ్య పాల్గొన్నారు.

అనాథ బాలికలను దత్తత తీసుకున్న చలసాని



హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు జన్మదిన వేడుకలు స్థానిక ఏలూరురోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీలో శుక్రవారం నిరాడంబరంగా జరిగాయి. శారీరక, మానసిక, అనాథ దివ్యాంగుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాథ బాలికలు శ్రీనిధి, పూర్వికలను చలసాని దత్తత తీసుకున్నారు. ఈ ఇద్దరి బాలికల విద్య, వసతి, వైద్యం పూర్తి బాధ్యతలను పూర్తిగా తానే భరిస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఆశాజ్యోతి సొసైటీ వ్యవస్థాపకుడు మరీదు వెంకటస్వామి, కరస్పాండెంట్ మల్లవల్లి మాధవీలత నుంచి చిన్నారులు శ్రీనిధి, పూర్విక‌ల దత్తత బాధ్యతలను స్వీకరించారు.

ఆ ఆరోపణలు అవాస్తవం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్లాట్ల యజమానులు

గన్నవరం: అసంపూర్ణంగా నిలిచిపోయిన కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్మాణాలు పూర్తిచేసి ప్లాట్లు అప్పగించిన వ్యక్తిపై నిరాధార ఆరోపణలు తగవని రాఘీ ఎవెన్యూ(చంద్రిక అయోధ్య) ప్లాట్ల యాజమానులు పేర్కొన్నారు. స్థానిక రాఘీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్లాట్ల యాజమానులు మాట్లాడుతూ.. స్థానిక వీఎస్. పురం రోడ్డులో 670 ప్లాట్లతో చేపట్టిన కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ ప్లాట్ల కోసం లక్షల రూపాయిలు రాఘీ అవెన్యూ సంస్థకు చెల్లించినట్లు తెలిపారు. తీరా 2021లో పిల్లర్ల దశలోనే అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని సదరు సంస్థ ఎండీ వేణు ఆర్థిక, అనారోగ్య కారణాలతో నిలిపివేశారని చెప్పారు. దీంతో ముందుగానే ప్లాట్ల కోసం డబ్బు చెల్లించి మోసపోయిన తమ విజ్ఞప్తి మేరకు డెవలప్‌మెంట్ కోసం భూములు ఇచ్చిన గుర్రం నాని నిర్మాణాలను పూర్తిచేసేందుకు వలంటీరిగా ముందుకు వచ్చారని తెలిపారు. ప్లాట్ల యాజమానులు చెల్లించాల్సిన మిగిలిన డబ్బులతో అత్యాధునీక హంగులతో అపార్టుమెంట్ల మొదటి ఫేజ్ నిర్మాణాలను పూర్తిచేసి ప్లాట్ల యాజమానులకు అప్పగించినట్లు చెప్పారు. ప్లాట్ల యాజమానుల నుంచి అదనంగా ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదని స్పష్టం చేశారు. రెండవ ఫేజ్ నిర్మాణాలు నిమిత్తం వేణుకు అడ్వాన్స్‌లు చెల్లించిన వారికి కూడా మొదటి ఫేజ్‌లో తక్కువ ధరకు ప్లాట్లు కేటాయించి న్యాయం చేసినట్లు తెలిపారు. రాఘీ ఎవెన్యూ ఎండీ వేణు తమను మోసగించినప్పటికి ఆ సంస్థ పేరుతోనే గుర్రం నాని నిర్మాణాలు పూర్తిచేసి తమకు రిజిస్ట్రేషన్ చేసినట్లు వివరించారు. అయినప్పటికి గుర్రం నాని ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొంత మంది స్వార్థపరులు ఎల్లో మీడియా ద్వారా అసత్య కథనాలు రాయించడం బాధ కలిగించిందన్నారు. ఇప్పటికైన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ప్లాట్ల యాజమానులు ఏవీఎస్‌ఎస్‌ఎం. రాజు, మోహన్‌కుమార్, మణివర్మ, పెద్దినేని పార్వతి, డీసీహెచ్. పుల్లయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై ప్రత్యేక నిఘా

ఉయ్యూరు: నకిలీ మద్యం మోసగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామని ఉయ్యూరు ఎక్సైజ్ సీఐ శేషగిరి రావు అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకు మద్యం సరఫరా చేస్తామని చెప్పి నకిలీ మద్యం విక్రయించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోయి అనారోగ్యం పాలు కావొద్దని సూచించారు. మోసగాళ్ల సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 14405, 94409 02451కు ఫోన్ చేసి అందించాలని సూచించారు.

'ఫొటో' జీవితంలో ముఖ్యమైన భాగం



పెనమలూరు: ఫొటో.. జీవితంలో ముఖ్యమైన భాగమని, తరతరాలుగా గుర్తుండిపోయే చారిత్రక దృశ్యమని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కానూరులో శుక్రవారం ఏపీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ షో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఫొటో కేవలం ఒక సంఘటనను గుర్తుంచుకునే సాధనమే కాదని, తరతరాలుగా గుర్తుండిపోయే దృశ్యమన్నారు. ఫొటో ట్రేడ్ వల్ల ఫొటోగ్రాఫర్లకు ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. అనేక కార్యక్రమాల్లో ఫొటోగ్రాఫర్ పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, బీజేపీ నాయకుడు బబ్బూరి శ్రీరామ్, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.